



రవిగాంచనిచోటు కవిగాంచిన గాంచవచ్చు గాని, దివినుండి దిగివచ్చిన దేవతా మూర్తి యైనాసరే, తామరసనేత్ర తప్తహృదయాన్ని తెలుసుకోలేదు. అది ఆ బాలగోపాలమునకుం దెలిసిన నగ్నసత్యం. "ఆడదంటే అలుసు కాదోయ్ అవనిలో దేవత" అని గొంతెత్తి ప్రేమగీతాలు ఆలాపనచేస్తాడు ఓ అశ్రిత ప్రణయపిపాసి. ఆడదాన్ని నమ్మే నమ్మరాదంటాడు బారెడు గెడ్డాం పెంచిన ఓ బైరాగి. అందానికి ఆడదానికి అవినాభావ సంబంధముంది. అందం ఆడదాని సొత్తంటాడు ఓ ఆంజనేయమూర్తి. ఏదెలా ఉన్నా, ఆడదే రామ–రావణ యుద్ధానికి నాంది. ఆడదానికి తొడమీద స్థానంచూపి, తొడ విరగ్గొట్టుకొన్నాడు రారాజు. ఆడదాని కిచ్చిన వరాలు నిలబెట్టుకుందికి కన్నకొడుకులనే కారడవుల పాలు చేశాడు ఓ అమాయకపు అవనిపతి. ఆడదాని మాటలునమ్మి, తన గర్భవాసమందు జన్మించిన అందాలరాశి కొమరుని కాళ్లు నరికించివేశాడు కామాతురుడైన ఓ వృద్ధనృపతి. అరిషడ్వర్గాలకి పునాదివేసింది ఆడది. "ఇనుప కచ్చడాల్ కట్టుకొన్న మునిముచ్చులెల్ల తామరసనేత్రలిండ్లబందాలుగారె" అన్న అష్టదిగ్గజాల్లో, ఓ దిగ్గజంవాక్కు దివ్యసందేశమే ముమ్మాటికీ. పీచుడదీసి, పెంకు బ్రద్దలు కొడితే కొబ్బెరలోని నీరు లభ్యమౌతుంది కాని, బుర్ర పగులగొట్టుకొన్నా, అగాధమైన ఆడదాని మనస్సు కనుక్కోవటం, కనుక్కుందికి ప్రయత్నించటం ఒట్టి అవివేకం.

రాజమ్మ రంగనాథంగారి ద్వితీయకళత్రం. రెండో పెళ్లిచేసుకునేముందు ఆహోరాత్రాలూ "చేసుకొందామా వద్దా" అని ఆలోచించి, తుదకు రాజమ్మనుచూచి రాగమనస్కుడై, రహదారీ బంగళాలో రంగురంగుల విద్యుద్దీపాలమధ్య, రాజమ్మ మెళ్లో మూడు ముళ్లూ వేశాడు. రాజమ్మను అర్ధాంగిగా స్వీకరించటం రంగనాథంగారు చేసినది తన దృష్టిలోనూ, సంఘందృష్టిలోనూ కూడా సబబైనపనే! కాని గుసగుసలు, చిచింద్రీలు, ట్రంక్‌టెలిఫోన్‌లూ, మాటామంతీ ఆడుకోడంలో "రంగనాథం రాజమ్మంటే పడిచచ్చినా, రాజమ్మ రంగనాథాన్ని పెళ్ళాడిందా, రంగనాథం డబ్బునా?" అనే రవ్వలు రభస నాటకానికి, ప్రార్థనాగీతం పాడ్తున్నాయ్.

కాలచక్రం దొర్లిపోతోంది. ఇంటి అజమాయిషీ అంతా రాజమ్మదే. రంగనాథం కష్టార్జితం, అన్యాయార్జితంకూడా ఆమెచేతుల్లోనే పోస్తున్నాడు. తనకు సిగరెట్‌పాకెట్‌కు డబ్బు కూడా ఆమె యివ్వాల్సిందే! ఆమె 'కా' అంటే 'కా' 'కి' అంటే 'కి'. రంగనాథం చెలాయిస్తున్నది ఆఫీసర్‌గిరి అయినా, రాజమ్మకు తాబేదారే. అదంతా మోజే అనండి, విపరీత నాగరకతే అనండి.

రచన :
పారనంది లోకనాథేశ్వరరావ్

రంగనాథంగారు క్యాంపువెళ్లి అపుడే రెండు దినాలైంది. ఇంకా వారంరోజులవరకు రారు. ఆనాటి మధ్యాహ్నం, మధ్యహాల్లో యీజీచేర్లో కూచొని, రాజమ్మ రహస్యంగా సంపాదించిన కొక్కొకశాస్త్రం చదువుతూ తన్నుతానే మరచిపోతోంది.

"లక్ష్మ" తుళ్లిపడింది రాజమ్మ.

గుమ్మంలో ఓ యువకుడు చేతిలో పుస్తకంతో సాక్షాత్కారం.

"ఎవరండీ! ఏంకావాలి?....అంది రాజమ్మ ఆదోలా చూస్తూ.

"లక్ష్మి లేదండీ! నిన్న కాలేజీలో ఆమె నోట్సు పుచ్చుకున్నాను. అది వెంటనే కావాలనిందామె. అందుచేత పట్టుకొచ్చా ఆమె కివ్వటానికి"

"అలాగా....లక్ష్మి యింట్లోలేదు. మాటినీ చూట్టానికి వెళ్ళింది....అరరె! అవతల నుంచున్నారే....రండి .... కూర్చోండి .... లక్ష్మి కూడా వచ్చేస్తుంది కాస్సేపట్లో" అంటూ ఆమె కనతి దూరంలోనేవున్న పేము కుర్చీ చూపింది రాజమ్మ.

"ఫరవాలేదండీ" అంటూనే కూచున్నాడు యువకుడు.

రాజమ్మ రయ్యమని గదిలోకిపోయి ఫ్లాస్కులో కాఫీ కప్పులోపోసి తెచ్చి "తీసుకోండి" అంటూ యువకుని కందించింది.

"ఎందుకండీ....యిపుడే త్రాగాను...."

"ఈ కాఫీ....తీసుకోండి...." అంటూ బలవంతపెట్ట నారంభించింది రాజమ్మ. కాఫీ త్రాగాక "ఈ పుస్తకం ఆమె కందజేయండి.... నే నొస్తా" అంటూ లేచాడాయన.

"అంతతొందరేం....కూచోండి .... అన్నట్టు మీ పేరు?"

"రమణమూర్తి. ఇక్కడే కాలేజీలో బి.ఏ., చదువుతున్నా...."

"చాలా సంతోషం"

"మరి నే వస్తా"

"ఉండండి రమణమూర్తిగారు....ఆయన క్యాంపు వెళ్ళారు. నెలకు ఇరవైరోజులు తిరగటమే అదేం ఉద్యోగమో మరి .... ఇక్కడ ఏం ఉబుసుపోదు...."

"ఇంత మహాపట్నంలో ఉబుసుపోకపోవటానికేముందండీ ? ఏ పిక్చరుకో వెళ్తేపోయే దిగా లేదా బీచ్‌కి పోవచ్చుగా...."

"నిజమే మూర్తిగారూ! మీ కభ్యంతరం లేకపోతే అలా బీచ్‌ప్రక్క కెళ్దామా?" అంటూ చీరచెరుగుపెదాలమధ్యనిరికించింది రాజమ్మ. అదంతా సిగ్గేమో మరి! రమణమూర్తి తుళ్లి

పడ్డాడు. రంగనాధంగారికి ద్వితీయ వివాహమైందనీ, రాజమ్మ లక్ష్మినవతితల్లనీ, లక్ష్మి చెప్పడమే విన్నాడుగాని, ఆమెనుచూడ్డం యిదే ప్రథమం. ప్రథమ పరిచయంలోనే యీామె ఉబలాటం, విపరీతమైన చనువు ఏమిటో మూర్తి తలలో అలల్లా ఆలోచనలు రేకెత్తుతున్నాయ్.

"క్షమించండి....నా కా సాహసంలేదు...." అంటూ గుమ్మం దాటబోయాడు మూర్తి.

"మూర్తిగారు దీనిలోసాహసమేముందండీ. లక్ష్మితోమటుకు మీరు చనువుగా లేరా అలానే"



"ఒస్తానండీ! ఎవరేనాచూస్తే బాగుండదు.... అపరిచితుణ్ణి. నాతో మీరు బీచ్‌లో తిరుగుతే యింకేమన్నా ఉందా వెళ్ళొస్తా" అంటూ మూర్తి బిత్తరపుచూపు చూస్తున్నాడు.

"మూర్తిగారూ! మీరన్నదాంట్లో ఎంతేని. నగ్నసత్యం గోచరమౌతుంది. కాని మీరు వివేకం కలవారు విద్యావంతులు వినండి.... నా దోషమే అనండి, మా పెద్దలదోషమే అనండి. ధనవంతుడైన రంగనాధంగారికి భార్య నయ్యాను. అతని ధనమే నాకు తాళి కట్టింది. వయసుమళ్ళినవారు. నెలకు ఇరవై దినాలుగా క్యాంపులు వచ్చాక ఆఫీసుపని, రాత్రి పన్నెండుదాకాఆఫీసుకాగితాలు. తర్వాత అలసిసొలసి నిద్ర....నేనా....నన్ను చూస్తున్నారుగా....నాకూ వాంఛలున్నాయి. నాలో యౌవనోద్రేకం కట్టలు తెంచుకు అలల్లా విరుచుకుపడుతోంది. నాకూ మనసుంది. మీబోటి యువకుణ్ణిచూస్తే మనసవుతుంది. ఇంతిలా మాట్లాడుతున్నానని అన్యథా భావించి చులకనచేయకండి. ఆ భగవంతుడే మిమ్మల్నిక్కడకు అయాచితంగా పంపాడు కాదనకండి! అలా రండి...."

"ఆగండి....మీ ధోరణి విపరీతంగావుంది"

"అవును మీకు విపరీతంగానే వుంటుంది. నే చేస్తున్నపని తప్పని నాకు తెల్సు. విధికి ఎదురీత యీదగలవారెవరున్నారు? వృద్ధునికి భార్యనై ఇలా ఆరాటపడాల్సివచ్చింది. విధి నాటకంలో నాయకినయ్యాను. స్వభావసిద్ధమైన వాంఛాపూరితప్రకృతికి బానిసనయ్యాను. మీరు రూపవంతులు, యౌవనులు. నాలో రేగే యౌవనోద్రేకాన్ని అరికట్టేదెట్లా....కాదని నాలో చిచ్చు రేగనివ్వకండి. నాకోర్కె మన్నించండి" అంటూ మూర్తిచేయి పట్టుకొంది రాజమ్మ జారినపైటకూడా గమనించకుండా.

మూర్తి ఆమెచేయి విదలించుకొని "క్షమించండి....మీబోటి పెద్దింటివారికి తగనిపనిది. రంగనాధంగారికి ద్రోహంచేయలేను" అంటూ పోబోయాడు.

"వలచి వస్తున్న వనితను విదలించుకొని తూలనాడ్తున్నావ్ మూర్తీ....లక్ష్మితో నీవు సల్పే ప్రణయసయ్యాటలు నాకు తెలియనివి కావు ఏం" అంటూ క్రిందిపెదవి పై మునిపళ్లతో నొక్కిపెట్టి వికారంగా మూర్తివేపు చూస్తోంది రాజమ్మ.

"ఆగండి! హద్దుమీరుతున్నారు"

"ఆపనిచేస్తున్నది నేనుకాదు మూర్తీ నీవు. అమాయకపుకన్య లక్ష్మి ని పాడుచేయబోతున్నావ్. నీ సంగతి నాకు తెలియకపోలేదు. నీవామెకు వ్రాసినప్రణయలేఖలు బహుశా నాకు చేర్తున్నాయనే సంగతి నాకు తెలియదల్లేవుంది...."

"ప్రణయలేఖలా! నేనా లక్ష్మికి వ్రాశానా? మీ బెదిరింపుమాటలతో నన్ను లొంగదీసుకోలేరు రాజమ్మగారూ....మీ గొయ్యి మీరు తవ్వుకొంటున్నారు" అంటూ మూర్తి రివ్వున వీధిలోకి వచ్చేశాడు.

"అనుభవిస్తావులే" అన్నమాటలు మూర్తి చెవుల్లో ములుకుల్లా జొరబడ్డాయ్.

* * *

దినాలు దొర్లిపోతున్నాయ్. రాజమ్మమనసు మనసులోలేదు. ఎట్లాగైనా మూర్తిని తనవాణ్ణి చేసుకోవాలని ఉబలాట పడుతోంది. కాని మూర్తి నిరాకరణ ఆమెను కలచివేస్తోంది. ఆ యౌవనమూర్తి హృదిలోని మధువు హాలాహలంగా మారింది.

ఓనాటి సాయంత్రం తనగదిలో కూచొని లక్ష్మి చదువుకుంటోంది. పరీక్షలు దగ్గరవుతున్నాయ్.

"లక్ష్మీ!"

"ఎవరూ?....పిన్ని, ఏం పిన్నీ?"

"నిన్నో సంగతి అడగాలి. దాచకుండా చెబుతావా?"

"ఏమిటది పిన్నీ?" ఆశ్చర్యంగా అడిగింది లక్ష్మి.

"మూర్తి నీ క్లాస్‌మేట్ కదూ...."

"అవును పిన్నీ"

"అతన్నినీవుప్రే....మి....స్తు....న్నా....వా?

"ఏమిటి పిన్నీ యిదంతా...."

"చెబుతున్నా విను లక్ష్మీ! చదువుకొన్న దానివైతే అయావుగాని, నీకీ పాపిష్టి ప్రపంచం తీరు తెలీదు. విచక్షణాజ్ఞానంలేక, యౌవనోద్రేకంలో, కాలుజారి ఎందరో నీబోటి కన్నెలు చేతులారా తమజీవితాల్ని నాశనంచేసుకుంటున్నారు. ఆడదాని బ్రతుకు శృతిబిగించివుంచిన వీణలాంటిది. మగవాని 'మీటు' నేర్పుతో, అమాయకంగా ఆలాపనచేస్తూ, ఎపుడో ఒహప్పుడు తప్ప తెగిపోతుంది"

"అగు పిన్నీ....నాకేమీ నీవు చెప్పేది అర్థం కాలేదు.

మంచి సాధారణంగా అర్ధంకాదులే— అయినా మరోసారి చెబుతున్నా. ఆ మూర్ఖుడి స్నేహం వదులుకో."

"పిన్నీ! మూర్తిగూర్చి తెల్సుకోకుండానే యిష్టంవచ్చినట్టు మాట్టాడుతున్నావ్. మూర్తిగారి కుటుంబం ఒహప్పుడు బాగా బ్రతికిందే. మూర్తి మనకు దూరపుబంధువుకూడా. బంధుత్వమే కాకుండా, నాన్నగారికి, మూర్తితండ్రిగారికి ప్రాణస్నేహం. వారిద్దరిమధ్యా రహస్యమంటూ లేదు. హృద్రోగంతో మూర్తితండ్రి మరణించారు. మూర్తిగారికి, మరి నా అన్న ఆత్మీయులు లేకుండా పోయారు. మూర్తిని నాన్నగారికి అప్పచెబుతూ 'రంగనాధంగారు, యీ నా అల్లారుబిడ్డ ఏకాకి అయాడు. అన్నింటికీ మీరే. వాణ్ణోయింటివాణ్ణిచేసి, మావంశం నిలబెట్టే బాధ్యత మీదే' అంటూ కన్నుమూశారు మూర్తితండ్రిగారు. అరునెల్ల క్రిందటివరకు మూర్తి యిక్కడే వుంటున్నాడు. కారణాంతరాలవల్ల వేరే వుండవలసివచ్చింది"

"అవును నే నొహర్తెనొచ్చానుగా అడ్డుమరి" అన్నది రాజమ్మ ఉక్రోషంతో.

"అగుపిన్నీ! అంత వెర్రిగా మాట్టాడకు. మేమేం కానిపనులు చేయలేదు. బి.ఏ., పూర్తి కాగానే మేం వివాహం చేసుకోబోతున్నాం"

"వివాహం!" రాజమ్మగుండెల్లో మంట.

"అవును పిన్నీ నిజం"

"అయితే యిదంతా మీ నాన్నగారికి తెలిసే జరుగుతున్న నాటకమన్నమాట. ఆ దిక్కుమాలిన వాడితోటా నీ పెళ్లి"

"ఏమిటి పిన్నీ అంత విపరీతంగా మాట్టాడుతున్నావ్. నువ్వింత అకారణంగా ఎందుకు మండిపడ్తున్నావో మరి"

"మితిమీరి పోతున్నావ్ లక్ష్మీ! నే నెంత పరాయిదాన్నయినా నీవృష్టిలో నీకు నేను తల్లి ననే సంగతి మరచిపోకు. ఆ నీచుడు నిన్నెలా పెళ్లాడుతాడో చూస్తా! వాడితో నీవు కలసి తిరిగినట్టు తెలుస్తే, నీ కీ యింట్లో స్థానంకూడా వుండదు జాగ్రత" అంటూ రయమని వెనుదిరిగింది రాజమ్మ.

భోరుమని ఏడుస్తూ మంచంమీద వాలింది లక్ష్మి.

* * *

కాలేజీ నుంచొచ్చి గదితలుపు తెరవగానే కాళ్లకు తగిలింది పోస్టల్ కవర్. ఆతృతగా విప్పి చదువుకొన్నాడు మూర్తి.

మూర్తిగారూ !

"ఈ అనుకోని లేఖ మీకు ఆశ్చర్యాన్ని కలిగించవచ్చు. నా మనోవ్యథ మీతో చెప్పుకుందికి వేరే మార్గం తోచటంలేదు. మిమ్మల్ని కామించటమే కాదు, మూర్తిగారూ, మనసారా ప్రేమిస్తున్నాను కూడా. ఏనాడైతే మీ అమాయకపు, సుందరవదనం చూచానో ఆనాడే నా హృదయం మీ కంకితంచేశాను. రంగనాధంగారు మంచివారే. మీ రన్నట్టు పెద్దింటి వారే. కాని మంచితనం, భాగ్యం, స్త్రీవాంఛ తీరుస్తాయా? నాకూ స్త్రీ సహజమైన కోర్కెలుంటాయా మరి? వినండి! మీరు లక్ష్మిని ప్రేమిస్తున్నారని, పెండ్లి చేసుకోబోతున్నారని నాకు తెల్సు. నిరాఘాటంగా పెండ్లాడండి. గాని ఆ 'పెళ్లిజరగాలంటే' నామనసు తీర్చండి ముందు మూర్తిగారూ! ఆ తర్వాత సదా నా కండ్లయెదుటే వుంటారుగా....!"

మీకోసం పరితపించే

" మీ రాజ్యం "

మూర్తి ఒళ్లు కంపించిపోతోంది. 'కాముకి కులట రంగనాధంగారి జీవితంలో చిచ్చుపెట్టె కొరవి' అనుకోకుండానే అప్రయత్నంగా కవరు జేబులో నుంచుకొని పరుగుతీశాడు మూర్తి.

"మూర్తిగారా....రండి! రండి!!" రాజమ్మగారి ఆహ్వానం.

"రంగనాధంగారేరీ?"

"చెబుతా కూర్చోండి! వాకిట్లో నిలబడే మాటలా? హాల్లోకి రండి" అంటూ మూర్తి చేయిపట్టుకొంది రాజమ్మ—మూర్తి చేయి విదలించుకొంటూ హాల్లోకి వచ్చి పేముకుర్చీలో ఆసీనుడయాడు. రాజమ్మ అతని కెదురుగా ఒయ్యారంగా నుంచొంది.

"రంగనాధంగారొచ్చారా?"

"ఇవాళ రాత్రో రేపో వస్తారు"

"లక్ష్మీ"

"అబ్బ! ఏం ఆతృత లక్ష్మి!!! లక్ష్మిని చూడందీ ఉండలేవా ఏం మూర్తీ. పాపం నీ వెపుడు వచ్చినా లక్ష్మి లేకుండాపోతోంది."

"సరే" మూర్తి లేచాడు.

"కూర్చో మూర్తీ! యింకా నామీద కోపం పోలేదా? ఎన్ని తరుణాలిలా వ్యర్థంచేసుకోవటం? ఈసారి యేమైనాసరే నిన్ను ఒదల్లేను మూర్తీ" విధితలుపు వేయబోయింది రాజమ్మ.

"అగు కాముకి! ఈ యింటికి విషకీటకంలా దాపురించావ్. ఏమిటీ ఉత్తరం? ఏమిటీ బెదిరింపులు? లక్ష్మిని పెళ్లాడాలంటే ముందుగా నా కోర్కె తీర్చాలేం? అమాయకుడు, రంగనాధంగారికేకాక, నిర్మల ప్రేమమూర్తి నాలక్ష్మికి కూడా ద్రోహం తలపెట్టావ్. నీ నాటక మింక సాగదు జాగ్రత్త" అంటూ విసురుగా వెళ్లిపోయాడు మూర్తి.

"ప్రేమమూర్తి లక్ష్మి!" కంపించిపోతోంది ఈర్ష్యా రోషాల్తో రాజమ్మ.

ఆరాత్రే రంగనాధంగారు క్యాంపునుంచొచ్చి భోజనాలయాక మేడమీద ఆరుబయట యీజీ ఛేర్‌లో విశ్రాంతి తీసుకొంటున్నారు. ప్రయాణ బడలికేమో అలానే కుర్చీలో నిద్రపోయారు. అర్ధరాత్రి అతని కనతిదూరంలోనే రాజమ్మ అరమోడ్పు కనుదోయితో, తన కర్మను నిందించుకొంటూ కళ్లంట నీరుకారుస్తూ కూచుంది.

ఆమెహృదయంలో తాపం కోపం ఉక్రోషం.

తెల్లవారురఝామయింది. రంగనాధంగారికి మెలకువచ్చింది. రాజమ్మ అలానే ఎర్రబారిన కళ్లతో అతనికుర్చీ కానుకొని కూచుంది.

"రాజు నిద్రపోలే యింతసేపు ఆరుబయట యిలా కుర్చీలోనే నిద్రపోయానే, ప్రయాణ బడలిక, అయానం నిద్ర సుఖమెరుగదు. నువ్వింకా అలానే కూచున్నావా నిద్రలేక ఏమిటిది లే కళ్లింత ఎర్రగా ఉన్నాయో చూడు" అంటూ రాజమ్మభుజం తట్టుతూ బుజ్జగిస్తున్నాడు రంగనాధం.

రాజమ్మ కండ్లవెంట అశ్రుధారలు.

"ఏమిటిది రాజూ ఆ కళ్లంట నీళ్లేమిటి ? ఎందుకేడుస్తున్నావ్"

"ఏడుపు కాకింకా ఏముందినాకు. నా బ్రతుకే నాశనమైంది"

"ఏమిటిలా మాట్లాడుతున్నావ్. చెప్పు రాజూ" అంటూ ఆత్రంగా కుర్చీలోంచి లేచాడు రంగనాథం.

"ఏం చెప్పేది" రాజమ్మ వెక్కి వెక్కి ఏడుస్తోంది.

"చెప్పురాజూ, ఏం జరిగింది. నాకేమో అంతా అయోమయంగావుంది" అంటూ తత్తర పాటుతో రాజమ్మభుజాలు పట్టుకువూపాడు.

"చెప్తాను.దాచిప్రయోజనంలేదు.అమ్మాయి క్లాస్‌మేట్ రమణమూర్తిమీకుతెలిసేవుంటుంది. తెలియకేమిటి? అమ్మాయినిచ్చి అతనికి పెళ్లి చేస్తారటగా ? అతడు సంధ్యాసమయాన లక్ష్మి కోసం వొచ్చాడు. లక్ష్మి యింట్లోలేదు. మీరూ లేరుగా. ఎంతో చనువున్నట్టు కుర్చీలో కూచున్నాడు. ఏదో లేనిపోని ఉపోద్ఘాతం ప్రారంభించి నన్ను సంభాషణలోకి దింపాడు. కాస్సేపాగి మంచినీళ్ళిస్తారా అన్నాడు. సరే అని గాజుగ్లాసుతో నీళ్ళుతెచ్చి టేబిల్‌మీద పెట్టబోయేనరికి, నా చేతిలో గ్లాసు అందుకొని నావైపదోలా చూశాడు. అతనిలోని చెడుభావన నా కర్థమైంది. మీరు వెళ్లండి. వా రొచ్చాక వద్దురుగాని అన్నా. అలాగేగాని అంటూ ఏమిటో ఆ ధైర్యం మరి, కుర్చీలోంచి లేచి నా చేయి పట్టుకొన్నాడు. ఎంత విదలించుకొన్నా వొదలకపోయేసరికి, టేబిల్ మీది రూలర్ తీశా. ఒకటే పరుగు లంకించుకొన్నాడు. ఏం బ్రతుకంతా నాది. నన్ను మరి ముట్టుకోకండి. ఈ బ్రతుకు బ్రతికేకన్న ఏ నుయ్యో, గొయ్యో చూసుకోవటం నయం" అంటూ భోరుమంది రాజమ్మ.

రంగనాథం కొయ్యబారిపోయాడు. కళ్ళు ఎఱ్ఱబడ్డాయ్ .... "మూర్తీ .... ద్రోహి....తిన్న యింటివాసాలే లెక్కపెడతావురా...."అంటూ వెఱ్ఱివానిలా గబగబా మేడదిగి వీధిలో విరుచుకుపడ్డాడు రంగనాథం. మూర్తి యింటికి ఒకటే పరుగు.

"ఒరేయ్ .... మూర్తీ .... లుచ్చా" తలుపు తీయ్" అంటూ తలుపు దబదబకొట్టాడు రంగనాథం.

మంచినిద్రలోవుండి ఉలిక్కిపడి లేచి తలుపుతీశాడు. ఎదురుగా నిప్పులు కక్కే నేత్రాలతో రంగనాథం—

"ఏమిటిలా...."

"ఏమిటా....పద... యింటికి...." అంటూ మూర్తిచేయిపట్టుకువిసురుగా లాగాడు రంగనాథం.

"ఆగండి నేనే వొస్తాను" అంటూ డ్రాయరులో కవరు జేబులో పెట్టుకొని రంగనాథం గారిని అనుసరించాడు మూర్తి.

ఈ రభసంతా విన్న లక్ష్మి తృళ్లిపడి లేచి సావిట్లోకి వొచ్చింది. మూర్తిని విసురుగా యింట్లోకి ఒక్కత్రోపుత్రోసి, వీధి తలుపేశాడు రంగనాథం. ఈ సంఘటన చూచిన రాజమ్మ తృళ్లిపడింది. మూర్తిచెంప 'ఫెడేల్'మంది. 'నాభార్యనే చెరచాలని చూస్తావురా ద్రోహి. నీతండ్రి చచ్చాక కన్నకొడుకుకన్నా ఎక్కువగా చూశానే. నిన్నే యింటి వాణ్ణికూడా చేద్దామనుకొన్నానే. ఇదా నీవు చేయబోయే ప్రతిఫలం" అంటూ వెఱ్ఱివానిలా వాగుతున్నాడు రంగనాథం. లక్ష్మి తెల్లబోతోంది.

"ఆగండి....రంగనాథంగారూ! ఏళ్ళొచ్చినా విచక్షణాజ్ఞానం లేకుండాపోతోంది. ఆ కొట్టిన దెబ్బ....ఆ రాజమ్మగారిని కొట్టవలసిన బాధ్యత మీది. కాస్త ఓపికపట్టి వినండి. నిజానిజాలు తెలుస్తాయి. వెళిపోకండి రాజమ్మగారు. మీరు కూడా వుండండి. ఈ నాటకానికి మీరేగా కర్తలు; నాయికకూడా. వినండి రంగనాథం గారూ! ద్రోహం చేయతలపెట్టింది నేనుకాదు మీభార్య. యీ నంగనాచి మీకు ద్రోహం తలపెట్టింది. మీరానాడు క్యాంపులో వున్నారు. పూర్వపు బాంధవ్యరీత్యా, లక్ష్మికి తన పుస్తకం అందచేయాలని వచ్చా. లక్ష్మి యింట్లోలేదు. సరేనని వెళ్లబోతుంటే, నన్నాపి, కాఫీలతో సత్కరించి నన్ను కోరింది యీరాజమ్మ.... యీ కాముకి....ప్రేమపన్నులు వర్షించింది. మీ డబ్బు ఆమెకు తాళికట్టిందికాని మీరు కారట. మీకు ద్రోహంచేయలేనంటూ విసురుగా వెళ్లిపోయాను. తృణీకరింపబడ్డకాముకి. నాటినుంచి నాపై పగ. అయినా కామవాంఛ నాపై పోలేదు. లక్ష్మికి నాకూ మీ అనుమతిపై కాబోయే పెండ్లిని అండగాజేసుకొని, నన్ను బెదిరిస్తూ లేఖ వ్రాసింది పోస్టుద్వారా. అదీ నేటి సాయంత్రమే నా కందింది. లక్ష్మి ని పెండ్లిచేసుకోవాలంటే ముందుగా ఆమె వాంఛ తీర్చాలట. అపుడే లక్ష్మి నాకు దక్కుతుందట ఇదుగో మీభార్య వ్రాసిన ఉత్తరం" అంటూ కవరుతోనహా ఆ ఉత్తరం రంగనాథంగారి మొహాన కొట్టాడు మూర్తి.

రంగనాథం ఆ ఉత్తరం చదువుతూ కంపించిపోతున్నాడు. లక్ష్మి వెఱ్ఱిదానిలా చూస్తోంది....రాజమ్మ పెరట్లోకి ఒకటే పరుగు.

"కులటా ఆగు ఎక్కడికి పారిపోతున్నావ్" ఆమె వెనకాలే పరుగులెత్తాడు రంగనాథం పెరట్లోకి. అతని వెనక "పిన్ని....ఆగు" అంటూ లక్ష్మి....చలించకుండా వారి వెనకాలే రమణమూర్తి.

మరెక్కడి రాజమ్మ...."రాజూ" అంటూ నూతిలోకి చూశాడు రంగనాథం నూతిలోంచి బుడగలు....

"పాపం....రాజమ్మ!" అంటూ నూతిచప్టామీద కూలబడిపోయాడు రంగనాథం !!!

అతనిని చెరొకప్రక్క కూచొని ఓదారుస్తున్నారు లక్ష్మి-రమణమూర్తి కాబోయేమిథునం.

వేకువకోడి "కొక్కరోకో" మంది....!

★

